16- 9- 26 rakshana_praja jyothi Medhak.qxd 10/16/2026 4:50 AM Page 1

మన రాజధాని
రక్షణ
నిజం మా బలం
బాపట్ల | గుంటూరు | పల్నాడు
శుక్రవారం 16 అక్టోబర్ 2026 పేజీలు : 4

గుంటూరు పీఠంపై కోవెలమూడి ఆశలు!

రెండు దశాబ్దాల పార్టీ ప్రస్థానం.. సేవలకు గుర్తింపు దక్కేనా?

ఏడాదికే పరిమితమైన పదవీకాలం.. ఈసారి అవకాశంపై అధిష్ఠానం కసరత్తు!

గుంటూరు మేయర్ పీఠం ఎంపికలో కోవెలమూడి కుటుంబానికి మరోసారి అవకాశం దక్కుతుందా? గత రెండు దశాబ్దాలుగా తెలుగుదేశం పార్టీకి అండగా నిలవడం, పార్టీ అధికారంలోకి వచ్చాక మేయర్‌గా బాధ్యతలు చేపట్టినా ఏడాదికే పదవికి దూరం కావడం వంటి అంశాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. పార్టీకి చేసిన సేవలు, సామాజిక సమీకరణాలు, ఇతర ఆశావహుల పోటీని బేరీజు వేసి అధిష్ఠానం నిర్ణయం తీసుకోనున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం సాగుతోంది.

వివరాలు 2లో..

బాపట్ల పీఠంపై 'కమలం' కన్ను!

కూటమి రాజకీయాల్లో కొత్త మలుపు.. తెర వెనుక చక్రం తిప్పుతున్నదెవరు?

అన్నం సతీష్ ప్రభాకర్ వర్గం వ్యూహాలపై చర్చ..

ఎమ్మెల్యే నరేంద్రవర్మ నిర్ణయంపై ఆసక్తి

వివరాలు 2లో..

"బాపట్ల మున్సిపల్ పీఠం చుట్టూ సాగుతున్న రాజకీయ చదరంగంలో అసలు పావులు కదుపుతున్నదెవరు? కూటమి పొత్తులో భాగంగా భాజపాకు పీఠం దక్కుతుందన్న ప్రచారం తెరపైకి రావడంతో స్థానిక రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారాయి. మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ వ్యూహాలు, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ రాజకీయ ప్రాధాన్యం ఇప్పుడు చర్చనీయాంశాలయ్యాయి. ఒకవేళ పీఠం భాజపా చేతికి వెళితే నరేంద్రవర్మకు అన్నం సతీష్ ఎలాంటి భాగస్వామ్యం కల్పించబోతున్నారు? అభ్యర్థి ఎంపికలో ఎమ్మెల్యే మాటకు విలువ ఉంటుందా? లేక సొంత వర్గానికి పట్టం కడతారా? ఈ ప్రశ్నలకు రానున్న రోజుల్లో తేలే సమాధానాలే బాపట్ల రాజకీయ దిశను నిర్దేశించనున్నాయి."

స్థానిక సమరానికి సర్వం సిద్ధం!

ముగ్గురు కలెక్టర్ల పర్యవేక్షణలో ఎన్నికల కసరత్తు

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఏర్పాట్లు ముమ్మరం.. భద్రతకు పెద్దపీట

ఉమ్మడి గుంటూరు జిల్లాలో స్థానిక ఎన్నికల సందడి మొదలైంది. పల్లె నుంచి పట్టణం వరకు ప్రజాప్రతినిధుల ఎంపికకు రంగం సిద్ధమవుతుండగా.. ఎన్నికల నిర్వహణ బాధ్యతలను ముగ్గురు కలెక్టర్లు భుజాన వేసుకున్నారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో నామినేషన్లు, పోలింగ్, ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు ముమ్మరమయ్యాయి. సున్నిత, సమస్యాత్మక కేంద్రాల గుర్తింపు, ప్రత్యేక బలగాల మోహరింపు, అక్రమాల నియంత్రణపై యంత్రాంగం దృష్టి సారించింది. ఎన్నికల సమరంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పారదర్శకత, ప్రశాంతతే లక్ష్యంగా అధికారులు కార్యాచరణ రూపొందించారు.

వివరాలు 2లో..

స్థానిక సమరానికి పోలీసు పహారా..!

జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

చెక్‌పోస్టుల వద్ద ఆకస్మిక తనిఖీ

సమస్యాత్మక వ్యక్తులపై బైండోవర్

నామినేషన్ల నుంచి కౌంటింగ్ వరకు నిఘా

వివరాలు 2లో..

గుంటూరు జిల్లాలో స్థానిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలు, ఓటర్లను ప్రలోభపెట్టే చర్యలపై నిరంతర నిఘా ఉంచాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ సిబ్బందిని ఆదేశించారు. నామినేషన్ల నుంచి కౌంటింగ్ వరకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.

స్థానిక సమరానికి పోలీసు పహారా..!

గుంటూరు రక్షణ న్యూస్

స్థానిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల భద్రత, బందోబస్తు ప్రణాళికలు, తనిఖీల నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్లు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. చెక్‌పోస్టుల వద్ద ఆకస్మిక తనిఖీలు చేపట్టి అక్రమ నగదు, ఇతర ప్రలోభాల ద్వారా ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నాలను అడ్డుకోవాలని ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి సారించి, నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. గతంలో అల్లర్లకు పాల్పడిన వ్యక్తులు, రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచాలని, అవసరమైన సందర్భాల్లో చట్టప్రకారం బైండోవర్ చర్యలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి అక్కడ భద్రతను కట్టుదిట్టం చేయాలని సూచించారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పోలీసు బందోబస్తును ప్రణాళికాబద్ధంగా ఏర్పాటు చేయాల న్నారు. నామినేషన్ల స్వీకరణ నుంచి పోలింగ్, కౌంటింగ్ వరకు ప్రతి దశలోనూ పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేయాలని వకుల్ జిందాల్ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలు, ఓటర్లకు ప్రలోభాలు కల్పించే చర్యలపై డీఎస్పీలు రోజువారీగా పర్యవేక్షణ నిర్వహించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తిస్తూ, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

బాపట్ల పీఠంపై 'కమలం' కన్ను!

మొదటి పేజీ తరువాయి

బాపట్ల: రక్షణ బ్యూరో...

మున్సిపల్ పీఠం చుట్టూ బాపట్ల రాజకీయాలు ఆసక్తికర మలుపులు తిరుగుతున్నాయి. రిజర్వేషన్ల ప్రకటనతో మొదలైన రాజకీయ కదలికలు.. ఇప్పుడు కూటమిలో సీటు సర్దుబాటు చర్చలతో మరింత వేడెక్కాయి. బాపట్ల మున్సిపల్ పీఠాన్ని భాజపాకు కేటాయించను న్నారన్న ప్రచారం పట్టణంలో హాట్‌టాపిక్‌గా మారింది. స్థానికంగా బలాబలాలు, నాయకుల పలుకుబడి, తెరవెనుక వ్యూహాలపై చర్చలు సాగుతున్నాయి. ఒకవైపు తెలుగుదేశం పార్టీకి చెందిన ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ రాజకీయ లెక్కలు.. మరోవైపు భాజపా నేత, మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ వ్యూహాలపై ఊహాగానాలు ఊపందుకున్నాయి. అయితే, భాజపాకు మున్సిపల్ పీఠం కేటాయింపుపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు.

కూటమిలో సీటు సర్దుబాటు వెనుక లెక్కలేంటి?

బాపట్ల పట్టణంలో భాజపాకు క్షేత్రస్థాయిలో ఎంతవరకు బలం ఉందనే ప్రశ్న రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. అయినప్పటికీ, కూటమి పొత్తులో భాగంగా మున్సిపల్ పీఠాన్ని ఆ పార్టీకి కేటాయిస్తారన్న ప్రచారం ఆసక్తి రేపుతోంది. రిజర్వేషన్ల ప్రకటన అనంతరం స్థానిక నాయకుల ఆశలు, అభ్యర్థుల ఎంపిక, పార్టీల మధ్య సమన్వయంపై చర్చలు మొదలయ్యాయి. భాజపాకు పీఠం దక్కితే స్థానికంగా ఆ పార్టీ తరఫున ఎవరికి అవకాశం కల్పిస్తారు? వారి వెనుక ఎవరుంటారు? అన్న అంశాలు ప్రధానంగా మారాయి. సీటు సర్దుబాటులో స్థానిక రాజకీయ సమీకరణాలకు ప్రాధాన్యం ఉంటుందా? లేక కూటమి పెద్దల నిర్ణయమే కీలకమవుతుందా? అన్నది తేలాల్సి ఉంది.

అన్నం సతీష్ వర్గానికి అవకాశం దక్కేనా?

భాజపా నేత, మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ పేరు ఈ వ్యవహారంలో ప్రముఖంగా వినిపిస్తోంది. మున్సిపల్ పీఠం భాజపాకు కేటాయిస్తే ఆయన వర్గానికి ప్రాధాన్యం లభించే అవకాశాలున్నాయన్న ప్రచారం సాగుతోంది. రామకృష్ణాపురానికి చెందిన నర్సింగ్ కళాశాల నిర్వాహకుడు ప్యార్లీ సునీల్ భాజపా తరఫున పోటీ చేసే అవకాశం కోసం ప్రయత్నిస్తున్నారన్న చర్చ కూడా స్థానికంగా వినిపిస్తోంది. ఆయనకు అన్నం సతీష్ ప్రభాకర్‌తో సన్నిహిత సంబంధాలున్నాయన్న నేపథ్యంలో ఈ ప్రచారానికి ప్రాధాన్యం ఏర్పడింది. అయితే, అభ్యర్థిత్వంపై ఎలాంటి అధికారిక నిర్ధారణ లేదు. ఇదే సమయంలో, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ వైఖరి ఎలా ఉండబోతోందన్నది మరో ఆసక్తికర అంశం. కూటమిలో భాగస్వామ్య పార్టీకి పీఠం కేటాయిస్తే అభ్యర్థి ఎంపిక, మద్దతు విషయంలో ఆయన ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది చర్చనీయాంశమైంది. భాజపాకు మద్దతు ఇవ్వడంలో అభ్యంతరాలుంటాయా? స్థానికంగా తన వర్గానికి ప్రాధాన్యం కోరుతారా? లేక కూటమి నిర్ణయానికి అనుగుణంగా ముందుకు సాగుతారా? అన్న ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. ఈ నెల 28న మున్సిపల్ పీఠం కేటాయింపు, అభ్యర్థుల ఎంపికపై స్పష్టత వస్తుందన్న అంచనాల నేపథ్యంలో బాపట్ల రాజకీయాల్లో ఉత్కంఠ నెలకొంది. అన్నం సతీష్ ప్రభాకర్, నరేంద్రవర్మ మధ్య సమన్వయం ఎలా ఉంటుంది? భాజపాకు అవకాశం దక్కితే ఎవరి అభ్యర్థిత్వానికి ఆమోదం లభిస్తుంది? అన్న అంశాలు కీలకంగా మారాయి. ప్రస్తుతానికి ఇవన్నీ ప్రచారాలు, రాజకీయ అంచనాలకే పరిమితం. అధికారిక ప్రకటన వెలువడిన తర్వాతే కూటమి వ్యూహం, నాయకుల బలాబలాలపై స్పష్టత రానుంది. అప్పటివరకు బాపట్ల మున్సిపల్ పీఠం చుట్టూ రాజకీయ ఉత్కంఠ కొనసాగనుంది.

గుంటూరు పీఠంపై కోవెలమూడి ఆశలు!

గుంటూరు: రక్షణ బ్యూరో...

గుంటూరు నగర మేయర్ అభ్యర్థి ఎంపికలో సామాజిక సమీకరణాలు, రాజకీయ బలాబలాలు, పార్టీకి చేసిన సేవలు కీలకంగా మారుతున్న నేపథ్యంలో కోవెలమూడి కుటుంబం పేరు మరోసారి చర్చకు వస్తోంది. గత రెండు దశాబ్దాలుగా తెలుగుదేశం పార్టీతో కొనసాగుతున్న అనుబంధం, పార్టీ కష్టకాలంలోనూ నాయకత్వానికి అండగా నిలిచిన నేపథ్యం, నగర రాజకీయాల్లో కుటుంబానికి ఉన్న గుర్తింపు వంటి అంశాలు ఈసారి అభ్యర్థిత్వ పరిశీలనలో ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. గతంలో కోవెలమూడి రవీంద్రబాబు (నాని) మేయర్‌గా బాధ్యతలు నిర్వహించినప్పటికీ, ఆ పదవి ఎక్కువ కాలం కొనసాగకపోవడంతో కుటుంబానికి మరోసారి అవకాశం కల్పించాలనే అభిప్రాయం అనుచరుల్లో వ్యక్తమవుతున్నట్లు సమాచారం. ఈ పరిణామాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని అధిష్ఠానం నిర్ణయం తీసుకునే అవకాశముందని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

పార్టీ కోసం పనిచేసిన కుటుంబం.. గుర్తింపు దక్కేనా?

గుంటూరు నగర రాజకీయాల్లో కోవెలమూడి కుటుంబానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. పార్టీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా తెలుగుదేశం పార్టీతో అనుబంధాన్ని కొనసాగిస్తూ రాజకీయంగా తమ ప్రస్థానాన్ని నిర్మించుకున్న కుటుంబంగా ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. గత రెండు దశాబ్దాలుగా పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించడం, నాయకత్వం అప్పగించిన బాధ్యతలను నిర్వహించడం, పార్టీ అభ్యర్థుల విజయానికి సహకరించడం వంటి అంశాలను కుటుంబం అనుకూల వర్గాలు ప్రస్తావిస్తున్నాయి. ఇంతకాలం పార్టీకి అందించిన సేవలకు తగిన గుర్తింపు కల్పించాలనే వాదన ఈసారి మేయర్ అభ్యర్థిత్వ చర్చలో ముందుకు వస్తోంది.

అధికారంలోకి వచ్చినా.. పదవీకాలం స్వల్పమే!

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కోవెలమూడి రవీంద్రబాబు మేయర్ పదవిని చేపట్టడం కుటుంబ రాజకీయ ప్రస్థానంలో కీలక పరిణామంగా నిలిచింది. అయితే ఆ పదవిలో కొనసాగిన కాలం పరిమితంగానే ఉండటంతో, ఆశించిన స్థాయిలో పాలనా బాధ్యతలను నిర్వహించేందుకు అవకాశం లభించలేదనే అభిప్రాయం అనుచరుల్లో వ్యక్తమవుతోంది. గతంలో పార్టీ కోసం చేసిన కృషి, మేయర్‌గా పనిచేసిన అనుభవం, నగర రాజకీయాలపై ఉన్న అవగాహనను పరిగణనలోకి తీసుకొని ఈసారి కుటుంబానికి ప్రాధాన్యం ఇవ్వాలనే వాదన వినిపిస్తోంది. అయితే గత పదవీకాలం ఎంతవరకు అభ్యర్థిత్వానికి అనుకూలంగా మారుతుందన్నది అధిష్ఠానం తీసుకునే నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుంది.

సామాజిక సమీకరణాలే అసలు పరీక్ష!

మరోవైపు గుంటూరు మేయర్ అభ్యర్థి ఎంపికలో సామాజిక సమతూకం కీలకంగా మారింది. వివిధ సామాజికవర్గాలకు ప్రాతినిధ్యం కల్పించాలనే అంశంతోపాటు నగరంలోని రాజకీయ పరిస్థితులు, పార్టీకి ఉన్న ప్రజాబలం, స్థానిక నాయకుల అభిప్రాయాలను టీడీపీ నాయకత్వం బేరీజు వేయాల్సి ఉంది. కోవెలమూడి కుటుంబానికి అవకాశం కల్పిస్తే ఇతర ఆశావహుల స్పందన ఎలా ఉంటుంది? పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లగలరా? వంటి అంశాలు కూడా చర్చకు వచ్చే అవకాశం ఉంది.

అధిష్ఠానం లెక్కల్లో ఏది కీలకం?

మేయర్ పదవి కేవలం గౌరవప్రదమైన హోదా మాత్రమే కాకుండా, నగర రాజకీయాలపై ప్రభావం చూపే కీలక బాధ్యత. నగరపాలక సంస్థ పరిధిలోని డివిజన్లలో పార్టీ అభ్యర్థుల విజయానికి సహకరించడం, నాయకులు--కార్యకర్తలను సమన్వయం చేయడం, ప్రజలతో సంబంధాలు కొనసాగించడం వంటి అంశాల్లో మేయర్ అభ్యర్థి సామర్థ్యం కీలకం కానుంది. ఈ నేపథ్యంలో పార్టీ పట్ల విధేయత, గత అనుభవం, సామాజిక సమీకరణాలు, ఎన్నికల్లో పార్టీకి ఉపయోగపడే నాయకత్వ లక్షణాలను సమన్వయం చేస్తూ అధిష్ఠానం నిర్ణయం తీసుకునే అవకాశముంది. మొత్తంగా చూస్తే, కోవెలమూడి కుటుంబానికి ఉన్న రాజకీయ అనుబంధం, గతంలో మేయర్‌గా పనిచేసిన అనుభవం ఈసారి చర్చలో బలమైన అంశాలుగా నిలుస్తున్నాయి. అయితే ఇతర ఆశావహుల పోటీ, సామాజిక సమీకరణాలు, పార్టీ భవిష్యత్తు వ్యూహం కూడా తుది నిర్ణయాన్ని ప్రభావితం చేయనున్నాయి. ఇన్ని అంశాల మధ్య కోవెలమూడి కుటుంబానికి మరోసారి అవకాశం దక్కుతుందా? లేక అధిష్ఠానం కొత్త సమీకరణాలకు ప్రాధాన్యం ఇస్తుందా? అన్నది గుంటూరు రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

16- 9- 26 rakshana_praja jyothi Medhak.qxd 10/16/2026 4:50 AM Page 3

కలాం ఆశయాలు యువతకు ఆదర్శం

బాపట్ల రక్షణ న్యూస్

కలల్ని లక్ష్యాలుగా, లక్ష్యాలను విజయాలుగా మలుచుకోవాలంటూ యువతలో ఆత్మవిశ్వాసాన్ని నింపిన భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని రోటరీ క్లబ్ ఆఫ్ బాపట్ల అధ్యక్షుడు వేజండ్ల శ్రీనివాసరావు అన్నారు. కలాం జయంతిని పురస్కరించుకుని గురువారం బాపట్ల మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. యువత చిన్న లక్ష్యాలకే పరిమితం కాకుండా ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు నిరంతరం కృషి చేయాలని కలాం ఇచ్చిన సందేశం నేటి తరానికి మార్గదర్శకమన్నారు. జ్ఞానం సృజనాత్మకతకు, సృజనాత్మకత నూతన ఆలోచనలకు దారితీస్తుందన్న కలాం మాటలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. సామాన్య కుటుంబంలో జన్మించిన కలాం తన అసాధారణ ప్రతిభ, పట్టుదల, నిరంతర కృషితో దేశ అత్యున్నత పదవిని అధిరోహించారని కొనియాడారు. భారత అంతరిక్ష, క్షిపణి రంగాల అభివృద్ధికి విశేష సేవలందించి 'మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా ఖ్యాతి గడించారని పేర్కొన్నారు. 2002 నుంచి 2007 వరకు భారత రాష్ట్రపతిగా

సేవలందించిన కలాం.. విద్యార్థులు, యువతలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు విశేషంగా కృషి చేశారని తెలిపారు. ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టి, విద్యకు ప్రాధాన్యమిస్తూ దేశాభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలని శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ బాపట్ల కార్యదర్శి షేక్ మస్తాన్ వలి, కోశాధికారి కోళ్ళపూడి బాలాజీ, రోటరీ సభ్యులు ఇ. హరిబాబు, కోళ్ళపూడి ఉపేంద్ర గుప్త, ఎస్. రమేష్‌బాబు, కొత్త ఆంజనేయ వరప్రసాద్, అబ్దుల్ కలాం ఫౌండేషన్ నిర్వాహకుడు పఠాన్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు రక్షణ న్యూస్

బాపట్ల జిల్లా పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దసరా నవరాత్రుల పవిత్ర సందర్భాన్ని పురస్కరించుకుని విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ కనకదుర్గమ్మను కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. పర్చూరు నియోజకవర్గ ప్రజలందరిపై అమ్మవారి దివ్య ఆశీస్సులు నిరంతరం ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఎమ్మెల్యే ప్రత్యేకంగా ప్రార్థించారు. నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. దర్శనానంతరం ఆలయ అధికారులు, వేదపండితులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు వేదాశీర్వచనం అందజేసి, శేషవస్త్రాలు, అమ్మవారి ప్రసాదాలను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు బాపట్ల జిల్లా ప్రజలకు, పర్చూరు నియోజకవర్గ

ప్రజలందరికీ దసరా నవరాత్రుల ఆధ్యాత్మిక శుభాకాంక్షలు తెలియజేశారు. అమ్మవారి కృపాకటాక్షాలతో ప్రజలందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు.

ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టర్ తనిఖీలు

స్ట్రాంగ్ రూమ్‌లు, ఎన్నికల సామగ్రి పంపిణీ, ఓట్ల లెక్కింపు కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

చీరాల రక్షణ న్యూస్

ఈ నెల 28న జరగనున్న చీరాల మున్సిపల్ ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్.వి. సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం చీరాల మండల పరిధిలోని చీరాల ఇంజనీరింగ్ కళాశాల, సెయింట్ ఆన్స్ కళాశాలలను సందర్శించి ఎన్నికల నిర్వహణకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల స్ట్రాంగ్ రూమ్‌లు, ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలు, ఓట్ల లెక్కింపు కేంద్రాలను తనిఖీ చేశారు. ఎన్నికల సామగ్రిని సక్రమంగా పంపిణీ చేసేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద తగిన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో అవసరమైన వసతులు

కల్పించడంతో పాటు ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వహణలో భద్రత, పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట చీరాల ఆర్డీఓ నరసింహారావు, మున్సిపల్ కమిషనర్ డి. జోషాఫ్, చీరాల, వేటపాలెం మండలాల తహశీల్దార్లు గోపికృష్ణ, గీతారాణి ఉన్నారు.

నిరుపేద వృద్ధురాలికి రెడ్డి సేవా మిత్ర చేయూత

కర్లపాలెం రక్షణ న్యూస్

నిరుపేదలను ఆదుకోవడమే లక్ష్యంగా రెడ్డి సేవా మిత్ర ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ కార్యదర్శి ఏట్రా ప్రసాద్‌రెడ్డి తెలిపారు. కర్లపాలెం పంచాయతీ పరిధిలోని పాపిరెడ్డిపాలెంకు చెందిన నిరుపేద వృద్ధురాలికి బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. గత కొన్ని సంవత్సరాలుగా రెడ్డి సేవా మిత్ర ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ, గ్రామాల్లో ఉచిత నేత్ర వైద్య శిబిరాల నిర్వహణ, విద్యలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతుల అందజేత వంటి సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. మండలంలోని 20 గ్రామ పంచాయతీల పరిధిలో కులమతాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పేదలకు అండగా నిలుస్తున్నామని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సేవా మిత్ర అధ్యక్షుడు నంగు గోవర్ధన్‌రెడ్డి, కార్యదర్శి ఏట్రా ప్రసాద్‌రెడ్డి, కోశాధికారి అట్ల హరిబాబురెడ్డి, అట్ల శ్రీనివాస్‌రెడ్డి, పయనం శ్రీనివాస్‌రెడ్డి, అట్ల పోలిరెడ్డి, పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చు

కర్లపాలెం రక్షణ న్యూస్

ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు నేల సారాన్ని పెంపొందించుకోవచ్చని వ్యవసాయ శాఖ జిల్లా రైతు శిక్షణ కోఆర్డినేటర్ ఎస్. హెచ్. హుస్సేన్ అన్నారు. కర్లపాలెం మండలం యాజలి గ్రామంలోని రైతు సేవా కేంద్రం వద్ద ప్రకృతి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో, వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) సహకారంతో అంతర్జాతీయ మహిళా రైతు సంవత్సరం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ రంగంలో మహిళా రైతులు పోషిస్తున్న కీలక పాత్ర, ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యత, పర్యావరణ పరిరక్షణ, సుస్థిర వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయంలో మహిళల భాగస్వామ్యాన్ని మరింత పెంచాలని, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ఆచరించడం ద్వారా సాగు వ్యయాన్ని తగ్గించుకుని భూసారాన్ని కాపాడుకోవాలని సూచించారు. పర్యావరణానికి అనుకూలమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం ద్వారా భవిష్యత్ తరాలకు సారవంతమైన నేలను అందించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఉప్పునీటి పరిశోధన కేంద్రం భూసార శాస్త్రవేత్త పి. మధువాణి, ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ కె. అచ్యుతరాజు, డీఆర్‌డీఏ ఏపీఎం బి. శ్రీనివాసులు, వ్యవసాయ అధికారి ఎం. సుమంత్‌కుమార్, బాపట్ల మాస్టర్ ట్రైనర్ గంజి శ్రీకాంత్, ఏఈఓ ఎం.డి. భాష, వీఏఏ తిరుమలేష్, మన్యం సత్యనారాయణ, ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

16- 9- 26 rakshana_praja jyothi Medhak.qxd 10/16/2026 4:50 AM Page 4

అభివృద్ధి పనులపై కమిషనర్ సమీక్ష

గుంటూరు రక్షణ న్యూస్

గుంటూరు నగరంలోని ఆకులవారితోటలో నిర్మాణంలో ఉన్న తాగునీటి రిజర్వాయర్ పనులను డిసెంబర్ నాటికి పూర్తి చేసి ప్రజలకు తాగునీరు అందించాలని నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆకులవారితోట, బొంతపాడు, ఏటుకూరు ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆకులవారితోట రిజర్వాయర్ పనులు 40 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ఉద్యోగనగర్ రిజర్వాయర్ పనులను వేగవంతం చేయడంతో పాటు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, కార్మికులకు రక్షణ సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. బొంతపాడులోని క్రైస్తవ శ్మశానవాటికలో లైట్లు, నేమ్‌బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు. ఏటుకూరు చెరువుల హద్దులను సర్వే ద్వారా గుర్తించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, వాకింగ్ ట్రాక్‌లో లైటింగ్, గ్రావెల్ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఎస్ఈ జి. వెంకటేశ్వరరావు, ఈఈ సుందరరామిరెడ్డి, ఏసీపీ జకిరా, ఎస్ఎస్ వెంకటప్పయ్య, వివిధ శాఖల అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

యువత కలల సాకారానికి కలాం జీవితం మార్గదర్శకం

గుంటూరు రక్షణ న్యూస్

భారతరత్న, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితం నేటి యువతకు ఆదర్శప్రాయమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. కలాం జయంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక తూర్పు నియోజకవర్గ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే నసీర్ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నసీర్ మాట్లాడుతూ.. అబ్దుల్ కలాం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన మహనీయుడని కొనియాడారు. పేదరికం నుంచి ప్రస్థానం ప్రారంభించి, తన కృషి, పట్టుదలతో విజ్ఞాన శిఖరాలను అధిరోహించారని తెలిపారు. చిన్నతనంలో కుటుంబానికి అండగా ఉండేందుకు పేపర్ బాయ్‌గా పనిచేసిన కలాం.. ఆశయం, పట్టుదల ఉంటే పేదరికం ఉన్నత లక్ష్యాల సాధనకు అడ్డుకాదని నిరూపించారని పేర్కొన్నారు. మద్రాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఏరోనాటికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన కలాం.. భారత క్షిపణి పితామహుడిగా గుర్తింపు పొందారని నసీర్ తెలిపారు. దేశ తొలి ఉపగ్రహ వాహక నౌక ఎస్ఎల్‌వీ-3 రూపకల్పనలో కీలక పాత్ర పోషించారని, అగ్ని, పృథ్వీ వంటి క్షిపణుల అభివృద్ధిలో విశేష కృషి చేసి భారత రక్షణ రంగానికి ఎనలేని సేవలందించారని చెప్పారు. రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వహించిన సమయంలో రాష్ట్రపతి భవన్‌ను సామాన్య ప్రజలకు, విద్యార్థులకు అందుబాటులో ఉంచినందుకే కలాం ప్రజల రాష్ట్రపతిగా గుర్తింపు పొందారని అన్నారు.

స్థానిక సమరానికి సర్వం సిద్ధం!

మొదటి పేజీ తరువాయి

ఉమ్మడి గుంటూరు రక్షణ బ్యూరో

స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి ఉమ్మడి గుంటూరు జిల్లా యంత్రాంగం సిద్ధమవుతోంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ముగ్గురు కలెక్టర్లు కార్యాచరణను వేగవంతం చేశారు. నామినేషన్ల స్వీకరణ, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఎన్నికల సామగ్రి పంపిణీ, ఓట్ల లెక్కింపు, భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుతోపాటు అక్రమాలకు తావులేకుండా నిఘా వ్యవస్థను పటిష్ఠం చేస్తున్నారు. పట్టణ స్థానిక సంస్థలతోపాటు జెడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లను ఆయా జిల్లాల అధికారులు సమన్వయంతో చేపడుతున్నారు.

గుంటూరు జిల్లాలో షెడ్యూల్ ప్రకారం.. జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ, తెనాలి పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో 76 వార్డులు, తెనాలి పట్టణంలో 52 వార్డులు ఉన్నాయని, గుంటూరులో 6,09,667 మంది, తెనాలిలో 1,57,089 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు. అక్టోబర్ 16 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుందని, అక్టోబర్ 28న పోలింగ్, 30న ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఎన్నికల పర్యవేక్షణకు 50 స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు, 50 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. జిల్లాలో ఆరు వేల మంది ఉద్యోగులను ఎన్నికల విధులకు నియమించారు. అభ్యర్థులకు కుల ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తు చేసిన 24 గంటల్లో అందించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు అక్టోబర్ 21 నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు.

పల్నాడులో పటిష్ఠ భద్రత... పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల, ఎస్పీ కె. జగదీష్ అదహళ్లి ఎన్నికల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లను వెల్లడించారు. తొలి విడతలో పిడుగురాళ్ల, సత్తెనపల్లి, చిలకలూరిపేట, వినుకొండ, దాచేపల్లి, గురజాల, మాచర్ల మున్సిపాలిటీల్లోని 247 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. 3,38,294 మంది ఓటర్ల కోసం 465 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 188 హైపర్ సెన్సిటివ్, 155 సెన్సిటివ్ కేంద్రాలుగా గుర్తించారు. నామినేషన్ల స్వీకరణ అక్టోబర్ 16 నుంచి 18 వరకు కొనసాగనుంది. సమస్యాత్మక కేంద్రాల్లో అదనపు పోలీసు బలగాలను మోహరించడంతోపాటు రౌడీ షీటర్ల బైండోవర్, పెండింగ్ నాన్ బెయిలబుల్ వారెంట్ల అమలు వంటి ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ తెలిపారు. నామినేషన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద మూడంచెల భద్రత కల్పించనున్నారు. జిల్లాలో 28 జెడ్పీటీసీ, 419 ఎంపీటీసీ స్థానాలు, 507 గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఎన్నికల ఏర్పాట్లు కూడా చేపడుతున్నారు.

చీరాలలో ఏర్పాట్ల పరిశీలన... బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి. చీరాల మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు. చీరాల ఇంజినీరింగ్ కళాశాల, సెయింట్ ఆన్స్ కళాశాలలను సందర్శించి స్ట్రాంగ్ రూమ్‌లు, ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలు, ఓట్ల లెక్కింపు కేంద్రాలను పరిశీలించారు. బ్యాలెట్ బాక్సుల భద్రత, ఎన్నికల సామగ్రి పంపిణీ, సిబ్బందికి అవసరమైన సౌకర్యాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. మొత్తంగా మూడు జిల్లాల్లోనూ ఎన్నికల నిర్వహణకు యంత్రాంగం సన్నద్ధమవుతుండగా, శాంతిభద్రతల పరిరక్షణ, నిబంధనల అమలు, పారదర్శకతే లక్ష్యంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై కఠిన నిఘా

గుంటూరు రక్షణ న్యూస్

నగరంలో స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా, నిష్పక్షపాతంగా జరిగేలా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేయాలని నగర కమిషనర్, అడిషనల్ ఎలక్షన్ అథారిటీ కె. మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. గురువారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఫ్లయింగ్ స్క్వాడ్లు, స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. అక్రమ నగదు రవాణా, మద్యం పంపిణీ, ఓటర్లను ప్రలోభపెట్టే చర్యలపై కఠిన నిఘా ఉంచాలని సూచించారు. నగర ప్రవేశ మార్గాలు, ప్రధాన రహదారుల వద్ద తనిఖీలు నిర్వహించి, వాటిని వీడియో చిత్రీకరించాలని ఆదేశించారు. ప్రజలు, రాజకీయ పార్టీల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, రోజువారీ నివేదికలను ఎన్నికల అధికారులకు అందించాలన్నారు. రాజకీయ పార్టీల ర్యాలీలు, సభలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని, ఇందుకోసం నగరపాలక సంస్థలో సింగిల్ విండో విధానం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ఖర్చులు, ప్రచార కార్యక్రమాలతో పాటు రాజకీయ నాయకుల సోషల్ మీడియా ఖాతాలనూ పర్యవేక్షించాలని, ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ జి. రవీంద్రబాబు, మేనేజర్ బాలాజీ బాషా, ఫ్లయింగ్ స్క్వాడ్లు, స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్‌ల ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

వినుకొండ చైర్మన్ పీఠంపై వైసీపీ గురి

వినుకొండ రక్షణ న్యూస్

వినుకొండ మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చైర్మన్ అభ్యర్థిగా మైనారిటీ నాయకుడు పీఎస్ ఖాన్ పేరును మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఖరారు చేసినట్లు ప్రకటించారు. పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ విషయాన్ని వెల్లడించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన పీఎస్ ఖాన్‌కు అవకాశం కల్పించినట్లు తెలిపారు. పార్టీ నాయకులు, ముఖ్యులతో చర్చించి, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. చైర్మన్ పీఠాన్ని దక్కించుకునేందుకు పార్టీ శ్రేణులంతా ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. చైర్మన్ అభ్యర్థి పీఎస్ ఖాన్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అవకాశం కల్పించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో ఎన్నికల్లో విజయం సాధించేందుకు కృషి చేస్తానన్నారు. వినుకొండ మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకుని, ఆ విజయాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడికి బహుమతిగా అందిస్తానని పీఎస్ ఖాన్ ధీమా వ్యక్తం చేశారు.

ఎన్నికల భద్రతలో నిర్లక్ష్యం వద్దు

ఎస్పీ ఉమామహేశ్వర్

బాపట్ల రక్షణ న్యూస్

స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఆదేశించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.గురువారం జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ఎన్నికల భద్రత, నేర నియంత్రణ, పెండింగ్ కేసుల దర్యాప్తుపై అధికారులతో సమీక్షించారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, సున్నితమైన పోలింగ్ కేంద్రాలను తరచూ సందర్శించాలని సూచించారు. ఆయా ప్రాంతాల్లో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు, నాకాబందీ విస్తృతంగా నిర్వహించాలని ఆదేశించారు. రౌడీషీటర్లు, పాత నేరస్థులు, గత ఎన్నికల్లో వివాదాలకు కారణమైన వ్యక్తులను గుర్తించి బైండోవర్ చేయాలని, నిబంధనలు ఉల్లంఘించేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. పదేపదే నేరాలకు పాల్పడేవారిపై అవసరమైన సందర్భాల్లో పీడీ చట్టం ప్రయోగించి జిల్లా బహిష్కరణకు చర్యలు చేపట్టాలని సూచించారు.చెక్‌పోస్టుల వద్ద నిరంతర వాహన తనిఖీలు నిర్వహిస్తూ అక్రమ నగదు, మద్యం, ఇతర వస్తువుల రవాణాను అడ్డుకోవాలన్నారు. ఎస్ఎస్‌టీ బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్లు, రూట్ మొబైల్స్, షాడో టీమ్‌లను సమర్థవంతంగా

వినియోగించుకోవాలని ఆదేశించారు. గంజాయి, ఇతర మత్తుపదార్థాల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ఆపరేషన్ త్రిశూల్‌ను పటిష్టంగా అమలు చేయాలని తెలిపారు.సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు, రెచ్చగొట్టే పోస్టులు, వదంతులపై నిఘా ఉంచాలని ఎస్పీ సూచించారు. ఎన్నికల ఫిర్యాదుల స్వీకరణకు జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రత్యేక ఎలక్షన్ సెల్, కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మహిళల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని, పెండింగ్ కేసులు, నాన్ బెయిలబుల్ వారెంట్ల పరిష్కారంపై దృష్టి సారించాలని ఆదేశించారు.ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ స్పష్టం చేశారు. సమావేశంలో చీరాల డీఎస్పీ ఎండీ మోయిన్, రేపల్లె డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్, జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

స్థానిక సమరానికి జనసేన సన్నద్ధం

గుంటూరు రక్షణ న్యూస్

గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో జనసేన పార్టీకి 35 శాతం సీట్లు కేటాయించాలని ఆ పార్టీ గుంటూరు పార్లమెంట్ సమన్వయకర్త కిలారి వెంకట రోశయ్య డిమాండ్ చేశారు. మంగళగిరి, తెనాలి, పొన్నూరు, తాడికొండ నియోజకవర్గాల్లో జనసేన బలంగా ఉందని, పార్టీ బలమున్న స్థానాల్లో పోటీ చేస్తామని తెలిపారు.మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య క్యాంపు కార్యాలయంలో జనసేన జిల్లా సమన్వయకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకే పనిచేస్తామని స్పష్టం చేశారు. గుంటూరు కార్పొరేషన్‌లో 35 శాతం సీట్లు కేటాయించాలని కోరుతున్నట్లు తెలిపారు.గత ఎన్నికల్లో సాధించిన విజయాల తరహాలోనే రానున్న ఎన్నికల్లోనూ వందశాతం స్ట్రైక్ రేట్ సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ బలంగా ఉన్న ప్రాంతాల్లో పోటీకి సిద్ధమవుతున్నట్లు పేర్కొన్నారు.ఈ సమావేశంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, గంజి చిరంజీవి, చందు సాంబశివరావు, నాగేశ్వరరావు, పార్వతి నాయుడు పాల్గొన్నారు.

ప్రచార నిబంధనలు పాటించాలి

గుంటూరు రక్షణ న్యూస్

స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని గుంటూరు నగర కమిషనర్, అదనపు ఎన్నికల అధికారి కె. మయూర్ అశోక్ స్పష్టం చేశారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ఎన్నికల ఏర్పాట్లపై చర్చించారు.నియమావళి అమలుకు 16 బృందాలు, ఎనిమిది ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, ఎనిమిది స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా ప్రచార వాహనాలు వినియోగించడం, ర్యాలీలు నిర్వహించడం, హోర్డింగ్‌లు, బ్యానర్లు ఏర్పాటు చేయడం వంటి ఉల్లంఘనలపై చర్యలు తీసుకుంటామన్నారు. సరైన పత్రాలు లేకుండా తరలించే నగదును స్వాధీనం చేసుకుంటామని పేర్కొన్నారు.మేయర్ అభ్యర్థి ఎన్నికల

ఖర్చు పరిమితి రూ.25 లక్షలు, కార్పొరేటర్ అభ్యర్థి ఖర్చు పరిమితి రూ.10 లక్షలుగా ఉందని తెలిపారు. నామినేషన్ పత్రాల కోసం చెక్‌లిస్ట్‌లు అందజేస్తున్నామని, నో డ్యూ సర్టిఫికెట్ల కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ప్రచార సభలు, ర్యాలీలు, బ్యానర్లు, ఫ్లెక్సీలకు ముందస్తు అనుమతులు తీసుకోవాలని, మతపరమైన ప్రదేశాలను ప్రచారానికి ఉపయోగించరాదని, కులం, మతం ఆధారంగా ఓట్లు అడగకూడదని కమిషనర్ సూచించారు .సమావేశంలో నగరపాలక సంస్థ అధికారులు, టీడీపీ, బీజేపీ, వైఎస్సార్‌సీపీ, జనసేన, ఆమ్ ఆద్మీ పార్టీ, బీఎస్పీ, కాంగ్రెస్ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

స్థానిక సమరానికి వైసీపీ తొలి అడుగు

బాపట్ల రక్షణ న్యూస్

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కర్లపాలెం మండలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తొలి ఎంపీటీసీ అభ్యర్థిని ప్రకటించింది. తుమ్మలపల్లి ఎంపీటీసీ స్థానానికి యాతం లాజరును అభ్యర్థిగా మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి ప్రకటించారు. ఎన్నికల ప్రక్రియకు ముందుగానే అభ్యర్థిని ప్రకటించడం ద్వారా పార్టీ శ్రేణులను సమాయత్తం చేసే దిశగా వైసీపీ అడుగులు వేస్తోంది.కోన రఘుపతి పార్టీ శ్రేణులకు అండగా ఉంటూ ఎన్నికల బరిలో ముందస్తుగా అభ్యర్థిని ప్రకటించడం ద్వారా కార్యకర్తల్లో ఉత్సాహం నింపే ప్రయత్నం చేశారు. అభ్యర్థి ఎంపికతో తుమ్మలపల్లి ఎంపీటీసీ స్థానంలో వైసీపీ ఎన్నికల కార్యాచరణకు శ్రీకారం చుట్టినట్లయింది.

విధుల్లో నిర్లక్ష్యం పై సస్పెన్షన్ వేటు

గుంటూరు రక్షణ న్యూస్

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని నగరపాలక సంస్థ కమిషనర్, అదనపు ఎన్నికల అధికారి కె. మయూర్ అశోక్ హెచ్చరించారు. విధుల పట్ల అలసత్వం వహించినట్లు పేర్కొంటూ జీఎంసీలో జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్ (జేఓఏ)గా పనిచేస్తున్న ఏ. నాగరాజును సస్పెండ్ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే సిటీ ప్లానర్‌కు షోకాజ్ నోటీసు ఇచ్చారు. ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది తమకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా, సకాలంలో నిర్వర్తించాలని కమిషనర్ స్పష్టం చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తూ ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని సూచించారు.

విధుల నిర్వహణలో నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం ప్రదర్శించే వారిపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

16- 9- 26 rakshana_praja jyothi Medhak.qxd 10/16/2026 4:50 AM Page 6

గుండ్లకమ్మ పరివాహక ప్రాంతాన్ని హరితవనంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

ముండ్లమూరు రక్షణ న్యూస్

గుండ్లకమ్మ నది పరివాహక ప్రాంతాన్ని పచ్చని హరితవనంగా తీర్చిదిద్ది, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యమని హిందూ ధర్మ ప్రచార పరిషత్ చైర్మన్, మాజీ ఐఏఎస్ అధికారి దాసరి శ్రీనివాసులు అన్నారు. ఇందులో భాగంగా గుండ్లకమ్మ నది పుట్టిన ప్రాంతం గుండ్ల బ్రహ్మేశ్వరం నుంచి సముద్రంలో కలిసే గుండాయపాలెం వరకు తొమ్మిది రోజుల నదీ ప్రయాణాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ముండ్లమూరు మండలంలోని మారెళ్ల గ్రామంలో పర్యటించిన ఆయన గ్రామ సచివాలయం, పశువైద్యశాలను పరిశీలించారు. గుండ్లకమ్మ నది పరివాహక ప్రాంతంలో సుమారు 280 కిలోమీటర్ల మేర పర్యటిస్తూ, నది పరిరక్షణ, పచ్చదనం పెంపు, పర్యావరణ సమతుల్యత ఆవశ్యకతపై స్థానిక గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. నదీ పరివాహక ప్రాంతాన్ని పచ్చని వనంగా అభివృద్ధి చేయడం ద్వారా ప్రకృతి వనరుల పరిరక్షణకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ పర్యటనలో మారెళ్ల స్పెషల్ ఆఫీసర్ కాశిరెడ్డి, డాక్టర్ కాశిరెడ్డి, మహిళా పోలీస్ నిర్మలతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చీరాల వైసీపీ చైర్మన్ అభ్యర్థిగా షెర్లీ

చీరాల రక్షణ న్యూస్

చీరాల మున్సిపల్ ఎన్నికల్లో చైర్మన్ అభ్యర్థిగా డాక్టర్ ఇస్తర్ల షెర్లీని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఖరారు చేసింది. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పార్టీ అభ్యర్థిగా ఆమె పేరును నిర్ణయించడంతో చీరాల రాజకీయాల్లో ఎన్నికల సందడి మొదలైంది. మున్సిపల్ పీఠాన్ని దక్కించుకునే లక్ష్యంతో వైసీపీ అభ్యర్థి ఎంపికపై నిర్ణయం తీసుకుంది. చీరాల మున్సిపాలిటీలో పార్టీ విజయావకాశాలను దృష్టిలో ఉంచుకుని వైసీపీ నాయకత్వం అభ్యర్థిని ఖరారు చేసినట్లు తెలుస్తోంది. అభ్యర్థి ఎంపికతో పార్టీ శ్రేణులు ఎన్నికల కార్యాచరణపై దృష్టి సారించనున్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో చైర్మన్ పదవితో పాటు వార్డుల్లోనూ పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాల్సి ఉంది. మరోవైపు, చీరాల మున్సిపల్ ఎన్నికల్లో ఇతర రాజకీయ పార్టీలు ఎవరిని బరిలోకి దింపుతాయన్నది ఆసక్తికరంగా మారింది. వివిధ పార్టీల అభ్యర్థుల ప్రకటనలతో ఎన్నికల పోటీపై స్పష్టత రానుంది. చైర్మన్ అభ్యర్థిగా షెర్లీని ఖరారు చేయడంతో చీరాల మున్సిపల్ ఎన్నికల రాజకీయాలు మరింత వేడెక్కాయి.

కలాంకు కలెక్టర్ ఘన నివాళి

గుంటూరు రక్షణ న్యూస్

భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా గుంటూరు కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశానికి శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా అబ్దుల్ కలాం అందించిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. యువతలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడంతో పాటు విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచిన ఆయన జీవితం ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి తదితర అధికారులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు పటిష్ఠ ఏర్పాట్లు

ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు

నరసరావుపేట, రక్షణ

: పల్నాడు జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. ఎన్నికల నిర్వహణపై కలెక్టరేట్‌లో ఎస్పీ కె. జగదీష్ అదహళ్లితో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందని, ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో అధికారులను నియమించి అవసరమైన ఏర్పాట్లు చేపట్టామని వెల్లడించారు. గురజాల, మాచర్ల, పెదకూరపాడు, చిలకలూరిపేట, వినుకొండ, పిడుగురాళ్ల, దాచేపల్లి ప్రాంతాల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ వివరించారు. కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్నందున నరసరావుపేటలో ప్రస్తుతం ఎన్నికలు జరగడం లేదని, రెండో దశలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పెదకూరపాడు పరిధిలోని కొన్ని గ్రామాలకు ప్రస్తుత ఎన్నికల నుంచి మినహాయింపు ఉందన్నారు. ఎన్నికల నిర్వహణలో జోనల్, రూట్ అధికారులకు అవసరమైన అధికారాలు కల్పించామని చెప్పారు. జిల్లా సరిహద్దుల్లోని చెక్‌పోస్టుల వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా

తనిఖీ చేస్తామని, స్థానిక పోలీసులతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికల ప్రక్రియను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. ప్రతి ఓటరు ఎలాంటి భయం లేకుండా తన ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ కె. జగదీష్ అదహళ్లి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నేర చరిత్ర కలిగిన వారిని ముందుగానే బైండోవర్ చేశామని, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఎన్నికల సమయంలో అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు, రాజకీయ పార్టీలు పోలీసు యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్, ఎస్పీ కోరారు.

జీడీసీసీ బ్యాంకులో లిఫ్ట్ ప్రారంభం

రూ.24 లక్షలతో నూతన సౌకర్యం ఏర్పాటు

గుంటూరు, రక్షణ

గుంటూరులోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (జీడీసీసీ) పరిపాలనా కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన లిఫ్ట్‌ను బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు గురువారం ప్రారంభించారు. సుమారు 25 ఏళ్ల క్రితం నిర్మించిన పరిపాలనా భవనంలో ఇప్పటివరకు లిఫ్ట్ సౌకర్యం లేకపోవడంతో రైతులు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాల అధ్యక్షులు, ఖాతాదారులు, ఇతర సందర్శకులు పై అంతస్తులకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ సమస్యను పరిష్కరించాలని గతంలో జరిగిన బ్యాంకు మహాజన సభ సమావేశాల్లో పలువురు రైతులు, సహకార సంఘాల అధ్యక్షులు తమ అభిప్రాయాలను, ఫిర్యాదులను వెల్లడించారు. ఈ నేపథ్యంలో మహాజన సభ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల మేరకు సుమారు రూ.24 లక్షల వ్యయంతో లిఫ్ట్ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఈడబ్ల్యూఐడీసీ), గుంటూరు ద్వారా ఈ పనులను పూర్తి

చేశారు. నూతన లిఫ్ట్ అందుబాటులోకి రావడంతో బ్యాంకు కార్యాలయానికి వచ్చే రైతులు, సహకార సంఘాల ప్రతినిధులు, ఖాతాదారులు, వృద్ధులకు ప్రయోజనం కలగనుంది. వివిధ విభాగాలకు వెళ్లేందుకు మెట్లపై ఆధారపడాల్సిన అవసరం తగ్గడంతో పాటు సమయం ఆదా కానుంది. కార్యాలయంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, ఖాతాదారులకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందించడంలో భాగంగా ఈ సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. రైతులు, సహకార సంఘాల ప్రతినిధులు ఎదుర్కొంటున్న ఇబ్బందిని పరిష్కరించే దిశగా లిఫ్ట్ ఏర్పాటు ప్రాధాన్యం సంతరించుకుంది.